క్లుప్తంగా

జేపీఎన్‌సీలో ప్రాంగణ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో జెన్టడయల్, టాస్క్ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ మేరకు మొత్తం 100కి పైగా విద్యార్థులు హాజరు కాగా రాతపరీక్ష, ఇంటర్వ్యూ అనంతరం 16 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ రవికుమార్ అభినందించారు. కంపెనీల ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, ప్రవీణ్‌కుమార్, కోటా సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా ఉత్సవాలు



నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలో గౌసీయాపాక్ దర్గా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం యన్మన్‌గండ్లకు చెందిన అజ్మీర్ షరీఫ్, రియాజ్‌షరీఫ్‌ల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధం సమర్పించారు. అనంతరం గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జమ్ము, అజహర్‌అలీ, గౌస్, జాఫర్, ఖాజా, సమీయుల్లా, రాజేష్, శ్రీను ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో అన్నప్రసాద వితరణ

భూత్పూర్: పట్టణంలోని మునిరంగస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు గురువారం అన్నప్రసాదం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన టి.మురళీధర్‌గౌడ్ వారం రోజుల పాటు అన్న ప్రసాదం చేయనున్నారు. గత కొన్నేళ్లుగా టి.మురళీధర్ గౌడ్ భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరం

భూత్పూర్: మండలంలోని కర్వెనలో గురువారం కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూర్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి, 31 మందికి ఆపరేషన్ నిమిత్తం వైద్యులు నిర్ధారించారు. వారిని జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, లయన్ నటరాజ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు నాన్‌టీచింగ్ ఉద్యోగుల సదస్సు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు యూనివర్సిటీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగుల సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో నిర్వహించనున్నారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం పీయూలో నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో పర్వతాలు, రాణి, రాజేందర్, రామకృష్ణ, రాము, శ్రీను, శ్రీనాథ్ పాల్గొన్నారు.

22న కోడెదూడల వేలం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ దేవస్థానానికి భక్తులు మొక్కుల కింద ఇచ్చిన కోడెదూడల వేలం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆళహరి మధుసూదన్‌కుమార్, ఆలయ ఈఓ శ్రీనివాసరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, కేవలం రైతులు మాత్రమే పాల్గొనాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

శివమాలధారణ పాదయాత్ర



చిన్నచింతకుంట: మండలంలోని పల్లమరి గ్రామంలో శివమాలధారులు గురువారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరారు. శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు తరలి వెళ్లారు. అంతకుముందు గ్రామంలోని శివాలయంలో స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి భజన కీర్తనలు ఆలపిస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం శ్రీశైలానికి బయలు దేరి వెళ్లారు. దీంతో గ్రామంలో శివనామ స్మరణ మార్మోగింది. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పలువురు పాల్గొన్నారు.

పశువైద్యుల తనిఖీ



మిడ్జిల్: మండలంలోని వేముల గ్రామంలో రిసెర్చ్, బ్రీడర్ పౌల్ట్రీఫారాన్ని గురువారం పశువైద్యాధికారి శివరాజ్ తనిఖీ చేశారు. కోళ్ల ఫారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. కోళ్లు చనిపోతే లోతైన గుంతలు తీసి సున్నంతో పాటు మట్టిని వేసి పూడ్చాలని సూచించారు. ఏమైనా మరణాలు జరిగితే పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలుపాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది సాగర్, మేనేజర్ శ్రీనువాస్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- బుద్దారంలో రూ.2.92కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన
- విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాల పంపిణీ



బుద్దారంలో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఏనేమీదితండా, బుద్దారం, ఇబ్రహీంబాద్, హన్వాడ, టంకర, కొత్తపేట గ్రామాల్లో పర్యటించారు. బుద్దారం శివారులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రూ. 2.92 కోట్లతో నిర్మించనున్న సబ్‌స్టేషన్ ద్వారా రైతులకు, గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్య వల్ల గృహ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 6 సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సమస్య నివారణకు గౌండ్యాల్‌లో 132కేవీ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. 99శాతం జీరో బిల్లులు గృహజ్యోతి పథకం ద్వారా మండలంలో అమలవుతున్నాయన్నారు. రానున్న నాలుగేళ్లలో ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రతి సంవత్సరం 3500 ఇళ్లు నిర్మిస్తామన్నారు. త్వరలో ఇబ్రహీంబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలను సరఫరా చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ పీవీ రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీఓ యశోద, నాయకులు బుద్దారం సుధాకర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్, లింగంనాయక్, టంకర కృష్ణయ్య, షబ్బీర్‌హుస్సేన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్‌పీ రమణారెడ్డి, ప్రిన్సిపాల్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్‌పీ రమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళాడిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్‌ను, వారి ఆరోగ్యాలను పాడుచేస్తున్నాయన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని, అప్పుడే వాటిని నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రజియా సుల్తానా మాట్లాడుతూ యువత జీవితంలో ఏది సాధించాలన్నా లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సీఐ వీరారెడ్డి, డీవైఎస్ఓ శ్రీనివాసులు, నెహ్రూ యువకేంద్ర అధికారి కోటానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన



విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్

రాజాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ముందు గురువారం ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రెండు మూడురోజుల క్రితం పాఠశాల ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా విడిపోయి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పత్రికల్లో వచ్చింది. బుధవారం కేజీబీవీని తనిఖీ చేసి మరోసారి ఇలాంటి సమస్య పునరావృతం కావొద్దని హెచ్చరించారు. గురువారం ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థులను బయటికి తీసుకొచ్చి మళ్లీ ఆందోళన చేస్తుండటంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఎస్ఐ శివానందం విద్యార్థి సంఘాల నాయకులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. పరీక్షల సమయంలో సంఘటన చోటుచేసుకోవడం బాధాకరమని మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ పేర్కొన్నారు. ఈ సమయంలో విద్యార్థుల పరీక్షలపై ప్రభావం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీలో సమస్య ఉంటే, ఉపాధ్యాయులు ఇబ్బందులు పెడితే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, వసతిగృహాల్లోకి వెళ్లి విద్యార్థి సంఘాల నాయకులు ఇబ్బందులు పడకూడదని ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.

నర్సరీల పర్యవేక్షణ ముఖ్యం



నవాబుపేట: నర్సరీల పర్యవేక్షణ చాలా ముఖ్యమని, మండల స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ జయరాం నాయక్ అన్నారు. గురువారం మండలంలోని కోళ్లగుట్టతండాలో నర్సరీని ఆయన పరిశీలించారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో 10వేల మొక్కలకు తగ్గకుండా పెంచేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మండల అధికారులు ఏపీఓ జ్యోతి, బద్రునాయక్, శ్రీనివాస్ ఉన్నారు.

జాతర వాల్‌పోస్టర్ విడుదల



మిడ్జిల్: మండలంలోని వేముల గ్రామంలో ఈనెల 26 నుంచి శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, గ్రామస్తులు విడుదల చేశారు. 29వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సుదర్శన్, బాలు, శ్రీనివాస్‌గౌడ్, వీరారెడ్డి, బంగారు, భీంరాజ్, తదితరులు ఉన్నారు.

రైతులకిచ్చిన హామీని నెరవేర్చాలి



అడ్డాకుల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీని పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్, చెన్నగౌడ్, మల్లేష్, సురేందర్‌రెడ్డి, సూర్యనారాయణ, బుచ్చన్నయాదవ్, సుందరయ్య ఉన్నారు.

రీ సర్వేలో బీసీలందరూ నమోదు చేయించుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేలో నమోదు కాని బీసీలు ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు రీ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ మైత్రి యాదయ్య పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల గణన తేలాలంటే రీ సర్వేలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, బడ్జెట్, రాజ్యాధికారం వంటి అంశాల విషయంలో బీసీల లెక్క ఎంతో అవసరమన్నారు. బీసీలందరు నిర్లక్ష్యం చేయకుండా ఈ నెల 28 వరకు నిర్వహిస్తున్న రీ సర్వేలో నమోదు చేయించుకోవాలని కోరారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుకుందాం

స్టేషన్ మహబూబ్‌నగర్: మతోన్మాద సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు, సెక్యులర్ విలువలను పునరుద్ధరించేందుకు ప్రతి భారతీయ పౌరుడు సంసిద్ధం కావాలని సామాజిక వేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశం లౌకిక దేశమనే విషయాన్ని పాలకులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని విమర్శించారు. భిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాల ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. యూసీసీని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారన్నారు. ప్రపంచ దేశాలే నివ్వెరపోయేలా విద్వేషపూరిత భారతాన్ని సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

జెడ్పీహైస్కూల్‌లో ఇంటర్నల్ మార్కుల పరిశీలన

హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి గోపాల్‌నాయక్ సమక్షంలో గురువారం పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన నిర్వహించారు. ఎంఈఓ వెరిఫికేషన్ ఆఫీసర్‌గా, పరిశీలకులుగా వనజోదర్, పాండురంగం, వెంకటస్వామిలు విద్యార్థుల నీడ్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అధ్యాపకురాలికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ విద్యావిభాగం: మహబూబ్‌నగర్ పట్టణం కోయిలకొండ క్రాస్‌రోడ్డు ఏరియాకు చెందిన సీ అనితకు పొలిటికల్ సైన్స్ లో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొ ఫెసర్ డాక్టర్ చల్ల మల్ల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'ఏ సోషియో పొలిటికల్ స్టడీ ఆఫ్ ఎస్సీ అండ్ ఎస్టీ రిప్రజెంటేటివ్స్ ఇన్ తెలంగాణ స్టేట్–ఏ కేస్ స్టడీఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై అనిత చేసిన అధ్యయనానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రస్తుతం డాక్టర్ సీ అనిత మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. పొలిటికల్ సైన్స్‌లో ఆమెకు డాక్టరేట్ రావడంపై తోటి అధ్యాపకులు హర్షం వక్తం చేశారు.

ఉద్యోగి కుటుంబానికి బాండ్ల అందజేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని గద్వాల పీజీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన అమీర్ కుటుంబానికి పీయూ వీసీ శ్రీనివాస్ రూ.3.50 లక్షల విలువైన బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా ఎంపికపై హర్షం

కోయిల్‌కొండ: దేశ రాజధాని ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తాను ఎంపిక చేయడంతో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అశోక్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్యవైశ్య నుంచి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వడంపై దేశ ప్రధాని నరేంద్రమోదీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు వెంకటేష్, మందిపల్లిరాజు, శ్రీనివాస్, రాము, సతీష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అబ్దుల్ రహిమాన్ ఉర్సు



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లిలో మూడు రోజుల పాటు అబ్దుల్ రహిమాన్ (మాసన్న) ఉర్సు అంగరంగ వైభవంగా కొనసాగింది. గురువారం దర్గాలో స్వామివారికి దివ్యఖురాన్ ఫాతేహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల పీఠాధిపతులు హాజరై స్వామి వారికి పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక పార్థన చేశారు. కార్యక్రమానికి అజ్మీర్ ఖాజా నవాజ్ దర్గా షరీఫ్ వజీర్ హుస్సేన్, తాండూర్ దర్గా పీఠాధిపతులు సాబేర్ పాషా, అజీజ్‌పాషా, దుప్పల్లి దర్గా పీఠాధిపతులు కరుణాకర్‌గౌడ్, రోషన్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, దర్గా నిర్వహకులు శంకర్, సుదర్శన్, కమలాకర్, భగవాన్ పాల్గొన్నారు.

శివమాలధారుల దాహం తీరుస్తున్న దాత

దేవరకద్ర: కాలినడకన శ్రీశైలం వెళ్లే శివమాలధారులకు దాహం తీర్చడానికి దేవరకద్రకు చెందిన వెంకటేశ్ తన వంతుగా వాటర్ బాటిళ్లను అందిస్తున్నారు. నాలుగు రోజులుగా దేవరకద్ర పట్టణంలోని హాజిలాపూర్ వెళ్లే రహదారిపై శివ మాలధారులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందిస్తున్నారు. ఈ మార్గంలో కేవలం 16 కిలో మీటర్లు వెళితే 44వ జాతీయ రహదారి వస్తుంది. దీనివల్ల కాలినడకన వెళ్లే మాలధారులు ఈ దారిలో వెళ్తున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పలువురు అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం



వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ముసాయిదాబేగం

గండీడ్: హాస్టళ్లల్లో ఫుడ్, స్టోర్ కమిటీలు వేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం పేర్కొన్నారు. గురువారం ఆమె వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనంతో పాటు హాస్టల్‌ను పరిశీలించారు. గ్రామంలో ఉన్న ఎస్సీ హాస్టల్, సల్కర్‌పేట్ మినీ గురుకులం, గండీడ్ బీసీ హాస్టల్, కేజీబీవీలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని హాస్టళ్లలో, గురుకులాల్లో ఖచ్చితంగా ఫుడ్, స్టోర్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. కమిటీల పర్యవేక్షణ లేకపోతే నాణ్యత కష్టమవుతుందన్నారు. త్వరలో వాటిని ఏర్పాటు చేసి అన్ని రకాల రిజిస్టర్లు నమోదు చేయాలన్నారు. తర్వాత తనిఖీల్లో ఇవన్ని లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు తగు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ జనార్దన్‌లు ఉన్నారు.

ఎల్ఐసీలో ఖాళీలను భర్తీ చేయాలి



కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎల్ఐసీలో క్లాస్ 3, 4 క్యాడర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు వి.రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సురెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు సమ్మె నిర్వహించారు. రాజేశ్వర్ మాట్లాడుతూ ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఏడేళ్లలో 15 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారని, ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పాలసీదారులకు సత్వరమే సేవలు అందించాలంటే ఉద్యోగులతో జీవిత బీమా శాఖలను భర్తీ చేయాలని ఎల్ఐసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీ ప్రీమియంపై విధించే జీఎస్టీని వెంటనే తొలగించాలన్నారు. సమ్మెలో కరుణాకర్ గౌడ్, సాయిబాబా, ఆనందం, అనిల్‌కుమార్, ఇష్రత్ అలీ, ఖదీర్, వినయ్‌కుమార్, మల్లయ్య, సుధాకర్, శ్రీనివాసు లు, రాఘవేందర్, శ్రీకావ్య, ప్రవీణ, వర్షిణి, రోహిత్ పాల్గొన్నారు.

ముత్యాల ప్రకాశ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వంశీచంద్‌రెడ్డి, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: అనారోగ్యంతో మృతి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు ముత్యాల ప్రకాశ్ పార్థివ దేహానికి గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు నివాళులర్పించారు. ఎంపీ డీకే అరుణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

ముత్యాల ప్రకాశ్ మృతి తీరనిలోటు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడాభిమాని ముత్యాల ప్రకాశ్ మృతి తీరనిలోటు అని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పుట్టి సురేషందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశుభ్రత కార్యక్రమాల పరిశీలన



స్వచ్ఛ ఆటో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని రాంనగర్ (వార్డు నం.43)లో గురువారం పరిశుభ్రత కార్యక్రమాలను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలో ప్రజలు ఏ విధంగా వేస్తున్నది తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారో లేదో క్షేత్రస్థాయిలో గమనించి పారిశుద్ధ్య సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ గ్రామస్తులకు వైద్య సేవలు



గుడిబండ నుంచి ప్రత్యేక బస్సులో ఎస్‌వీఎస్‌కు వెళ్తున్న గ్రామస్తులు

దేవరకద్ర: మండలంలోని గుడిబండ గ్రామస్తులకు సేవా భారతి సహకారంతో జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎస్‌వీఎస్‌లో జరుగుతున్న మెగా క్యాంపునకు గుడబండ గ్రామంలో దీర్ఘకాలంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న 50 మందిని గుర్తించారు. వారందరికి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేసి గురువారం ఎస్‌వీఎస్‌కు తరలించారు. వారందరికి వైద్య పరీక్షలతో పాటు అవసరమైన శస్త్ర చికిత్సలు, ఉచితంగా మందులను ఇవ్వడానికి సేవా భారతి వారు ఏర్పాట్లు చేసినట్లు సేవా భారతి పాలమూర్ విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గుడిబండ నాయకులు అమరేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతరెడ్డి, చంద్రయ్య, అనిల్‌కుమార్, యశ్వంత్‌రెడ్డి, వెంకట్‌రాములు, వీహెచ్‌పీ చంద్రయ్య, పీఆర్వో బస్వరాజు పాల్గొన్నారు.

22 నుంచి దేవాలయ వార్షికోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం న్యూమోతీనగర్‌లోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వనాథేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం, కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త, చైర్మన్ ఎన్ ప్రభాకర్ తెలిపారు. గురువారం వార్షికోత్సవ, ప్రతిష్ఠాపన మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 22న పూజలు, 23న హోమం, విగ్రహప్రతిష్ఠాపన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్, యాదగిరి, సభ్యులు నరేష్, నాగేష్, వీరేష్, శ్రీధర్, రాము, శివ పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

రాజాపూర్: మండలంలోని కొత్రతండాలో తాగునీటి సమస్య తీర్చేందుకు గురువారం దోండ్లపల్లి మాజీ ఎంపీటీసీ అభిమన్యురెడ్డి తన సొంతఖర్చులతో బోరువేయించారు. దీంతో బోరుమోటారును బిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తండావాసులు అభిమన్యురెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హన్యానాయక్, హతిరాం, తౌర్యా, సురేష్, కొత్ర పాండు, లింగ్యా, తదితరులు పాల్గొన్నారు.